క్లుప్తంగా

వీవోఏల సమస్యలపై వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న వీవోఏలు

ఖానాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల వీవోఏలు పట్టణంలోని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను ఆమె నివాసంలో కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వస్తున్న సీఎంకు తమ సమస్యలను విన్నవించి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. వీవోఏలు బాదావత్ రవీందర్, లావణ్య, సుజాత, మమత, రమేశ్, నాగార్జున తదితరులు ఉన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఏపీపీ బి.అరుణ

భైంసాటౌన్: కేసుల పరిష్కారానికి కృషి చేయాలని భైంసా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.అరుణ అన్నారు. శనివారం కోర్టులోని తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పోలీసు, ఎక్సైజ్, అటవీ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 10న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించాల్సిన కేసుల విషయమై వారితో చర్చించారు. అపరిష్కృతంగా ఉన్న కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పట్టణ, ముధోల్ సీఐలు ఎల్.శ్రీను, వినోద్‌రెడ్డి, ఆయా మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.

'ఏలేటి' నివాసానికి అరవింద్ మీనన్



నేతలతో మాట్లాడుతున్న అరవింద్ మీనన్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నివాసానికి శనివారం సాయంత్రం బీజేపీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కో ఇన్‌చార్జి అరవింద్ మీనన్ వచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రస్తుత రాజకీయాలపై వారు చర్చించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రావుల రాంనాథ్, తదితరులు ఉన్నారు.

మంత్రి హరీశ్‌రావు జన్మదిన వేడుకలు



కుంటాలలో వేడుకల్లో పాల్గొన్న పార్టీ శ్రేణులు

కుంటాల: మండలంలో రాష్ట్రఆర్థికమంత్రి తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలను శనివారం బీఆర్‌ఎస్వీ మండల కన్వీనర్ ఒడ్నం అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, గ్రామ అధ్యక్షుడు రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, నాయకులు జుట్టు మహేందర్, దొనికెన వెంకటేశ్, ముత్యంరావు, బోగ లక్ష్మణ్, రఘు, గజేందర్, రాకేశ్, మహిపాల్, రమేశ్, ఉదయ్, సంతోష్ ఉన్నారు.

'బీసీబంధు' అమలు చేయాలి

భైంసాటౌన్: బీసీ ఉపకులాలకు బీసీ బంధు అమలు చేయాలని బీసీ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా కోఆర్డినేటర్ సుంకెట పోశెట్టి డిమాండ్ చేశారు. శనివారం భైంసాలో మాట్లాడుతూ.. జిల్లాలో సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వస్తున్న సీఎం కేసీఆర్ దళిత, గిరిజనులకు మాదిరి బీసీలకు బీసీ బంధు ప్రకటించాలని కోరారు. లేకపోతే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

అన్నదానం

కుంటాల: స్థానిక శ్రీరాంనగర్ కాలనీలో శనివారం భక్తులు పూజలు నిర్వహించారు. అంజన్నకు తమలాపాకులు, కుంకుమ తిలకం చేసి మొక్కు చెల్లించుకున్నారు. సాంగ్వీ పండరి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



దస్తురాబాద్ రైతు వేదిక వద్ద..



రేవోజీపేటలో రైతు దినోత్సవంతో మాట్లాడున్న ఎమ్మెల్యే రేఖానాయక్



కుభీర్: మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీబాయి

ఊరూరా రైతు దినోత్సవం

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా రైతు దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకున్నారు. జెడ్పీటీసీలు, సర్పంచులు, అధికారులు రైతులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ర్యాలీతో రైతు వేదికల ప్రాంగణాలకు చేరుకున్నారు. దస్తురాబాద్ మండలం రేవోజీపేట రైతు వేదికలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ మాట్లాడారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. క్లస్టర్ల పరిధిలోని రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ముధోల్‌లో ఎడ్లబండి ర్యాలీలో రైతులు



కడెం: మాట్లాడుతున్న ఎంపీపీ అలెగ్జాండర్



నర్సాపూర్(జి): మాట్లాడుతున్న ఆర్బీఎస్ మండల అధ్యక్షుడు గోపిడి గంగారెడ్డి



సోన్:మాట్లాడుతున్న ఎంపీడీవో, నాయకులు



ఖానాపూర్ మండలం దిలావర్‌పూర్‌లో..



దిలావర్‌పూర్: బన్సపల్లి రైతు వేదిక వద్ద..



లక్ష్మణచాంద మండలం పీచరలో ర్యాలీ



కడెం: ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో స్రవంతి



తానూరు: మాట్లాడుతున్న ఏఈవో సంఘవి

వెరైటీ'టీ'..!

- చాయ్ దుకాణాలకు కార్పొరేట్ లుక్
- వెరైటీ చాయ్‌లకు పెరుగుతున్న ఆదరణ



భైంసాలోని టీ పాయింట్‌లో చాయ్ తాగుతున్న దృశ్యం

భైంసాటౌన్: 'అరె మామ చాయ్ తాగుదాం'.. ఏ ఇద్దరు దోస్తులు కలిసినా సాధారణంగా వినిపించే మాటే. నలుగురు ఒక చోట కలిసి కబుర్లు చెప్పుకుంటూ చాయ్ తాగుతుంటే ఆ మజాయే వేరు.. అయితే, గతంలో చాయ్ అంటే ఒకటే వెరైటీ. కానీ, ప్రస్తుతం అలా కాదు. ఎన్నో వెరైటీ చాయ్‌లతో కొత్త కొత్త దుకాణాలు కార్పొరేట్ లుక్‌తో వెలుస్తున్నాయి. జనాలు సైతం కొత్త రకం వెరైటీలను ఆదరిస్తున్నారు. రూ.20 నుంచి మొదలు రూ.50 వరకు పలు రకాల చాయ్‌లు లభిస్తున్నాయి.

కార్పొరేట్ లుక్‌తో...

గతంలో చాయ్ హోటళ్లంటే పొగచూరిన గోడలతో దర్శనమిచ్చేవి. కప్పు సాసర, గాజు గ్లాసుల్లో వేడి వేడి చాయ్ ఇచ్చేవారు. అయితే రానురాను అల్లం టీ, గ్రీన్ టీ, లెమన్ టీ.. అంటూ ఇలా పలు వెరైటీలతో చాయ్‌లు రావడం మొదలైంది. కానీ, ప్రస్తుతం కార్పొరేట్ లుక్‌తో టీ దుకాణాలు వెలుస్తున్నాయి. పలు కంపెనీలు బ్రాంచ్‌ల పేరిట పట్టణాలు, నగరాల్లో టీ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నాయి. దమ్ టీ, జింజర్ టీ, జింజర్ లెమన్ టీ, బ్లాక్ టీ, బెల్లం పెప్పర్ టీ, కాఫీ, మసాలా టీ, బాదామ్ మిల్క్, కశ్మీరి టీ, కుల్లడ్ టీ, గ్రీన్ టీ..ఇలా ఎన్నో వెరైటీల చాయ్‌లు అందిస్తున్నారు.

వెరైటీలు బాగుంటున్నాయి



టీ పాయింట్లలో రకరకాల చాయ్‌లు బాగుంటున్నాయి. కాస్త కార్పొరేట్ లుక్‌తో వెరైటీ టీలు అందిస్తున్నారు. హోటళ్లలో కంటే టీ పాయింట్లలో కాస్త ప్రశాంత వాతావరణం ఉంటుంది. టీతో పాటు స్నాక్స్ కూడా బాగుంటున్నాయి. – మనోజ్, భైంసా

ఆదరణ బాగుంది



భైంసాలో మొదటిగా టీ పాయింట్ ఏర్పాటు చేశాం. కంపెనీ వారే మెటీరియల్ అందిస్తారు. మొదట్లో వినియోగదారులకు అవగాహన లేకపోయింది. కానీ, ప్రస్తుతం వెరైటీ చాయ్ తాగేందుకు కస్టమర్లు ఆసక్తి చూపుతున్నారు. ఆదరణ బాగుంది.
–భోజరాం, టీ పాయింట్ నిర్వాహకుడు, భైంసా

వరి కాడలకు నిప్పు



లోకేశ్వరం: మండలంలోని పంచగుడి సమీపంలో వరి కాడలకు నిప్పంటుకోవడంతో పంచగుడి –లోకేశ్వరం రహదారిని పొగ శనివారం కమ్మేసింది. రోడ్డుపై దట్టమైన పొగ రావడంతో ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి.

రైతులు బాధపడుతుంటే సంబరాలేంటి?

- పాలకులు, అధికారులను నిలదీసిన అన్నదాతలు

సారంగపూర్: ఓ పక్క ధాన్యం విక్రయాలు జరగక, లారీలు రాక, పంటను కొనుగోలు చేసేవారు కోతలు విధిస్తూ ఇబ్బంది పెడుతుంటే దశాబ్ది ఉత్సవాలను నిర్వహించడం ఏమిటని గ్రామాల రైతులు ప్రశ్నించారు. మండలంలోని గోపాల్‌పేట్, ఆలూరు, సారంగపూర్, స్వర్ణ, బీరవెల్లి రైతువేదికల్లో శనివారం రైతు దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే ఆలూరు, సారంగాపూర్ రైతు వేదికల పరిధిలోని రైతులు అధికారులు, పాలకులను నిలదీశారు. ఆలూరులో కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగానే వారు ఆగ్రహంతో ధాన్యం కొనుగోళ్ల అలస్యంతో నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. అక్కడే ఉన్న పీఏసీఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు పతాని రాధ, సర్పంచ్ దండురాధ, మాజీ సర్పంచ్ జీవన్‌రావుతో వాగ్వాదానికి దిగారు. అనంతరం రైతులంతా బయటకు వెళ్లి చెరువు గట్టున కూర్చున్నారు. ఈనెల 5న నుంచి సజావుగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని పీఏసీఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి నచ్చజెప్పినా వారు వినిపించుకోలేదు.

సారంగపూర్‌లో..

మండలంలోని జామ్, సారంగాపూర్, యాకర్‌పెల్లి గ్రామాలకు చెందిన రైతులు కార్యక్రమం ప్రారంభించగానే అధికారుల, పాలకుల తీరుపై మండిపడ్డారు. ధాన్యం నిల్వలు ఎక్కడిక్కడే పేరుకుపోయినా లారీలు పంపడం లేదని ఆగ్రహించారు. అక్కడికి చేరుకున్న సారంగాపూర్ ఎంపీటీసీ సభ్యురాలు సామల పద్మ రైతులకు మద్దతుగా బైఠాయించి నిరసన తెలిపారు. అక్కడే ఉన్న మాజీ డీసీఎంఎస్ అధ్యక్షుడు, కొట్ల(బి) పీఏసీఎస్ చైర్మన్ అయిర నారాయణరెడ్డి జోక్యం చేసుకుని ఈనెల 8లోగా మొక్కజొన్న పూర్తి చేయించి ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు పూర్తి సహకారం అందిస్తే చివరి గింజవరకు కొనుగోలు చేస్తామని తెలపడంతో వారు శాంతించారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.



సారంగపూర్‌లో వేదిక ముందు బైఠాయించిన ఎంపీటీసీ పద్మ, రైతులు

పిల్లలను బడిలో చేర్పించండి

భైంసా/లక్ష్మణచాంద/తానూరు/భైంసారూరల్/కడెం/ఖానాపూర్: జిల్లాలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడిబయట ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. భైంసాలోని ఏపీనగర్‌కాలనీ, లక్ష్మణచాంద మండలంలోని పీచర, వడ్యాల్, లక్ష్మణచాంద, నర్సాపూర్, తానూరు మండలం ఎల్వి, భైంసా మండలంలోని తిమ్మాపూర్, దేగాం, ఖానాపూర్ మండలంలోని కోలాంగూడ గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. కడెం మండలం అంబారిపేట్‌లో ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులను కలిసి పిల్లలకు పువ్వులు ఇచ్చారు. ఐదేళ్లు నిండిన చిన్నారులను బడికి పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంలో తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎంఈవో సుభాష్, పాఠశాలల హెచ్‌ఎంలు అశోక్ వర్మ, నర్సయ్య, విద్యారాణి, ప్రేమ్‌దాస్, హెచ్‌ఎం రాజశ్రీనివాస్, ఇన్‌చార్జి హెచ్‌ఎం మాధవ్‌రావు, ఉపాధ్యాయులు నర్సయ్య, సుజాతదేవి, వినాయక్‌రెడ్డి, రాజేందర్, బాజిరెడ్డి, వినోద్, శ్రీనివాస్, వీడీసీ సభ్యుడు భూమేష్, పీఈటీ శేఖ్ ఇమ్రాన్, నాయకులు లచ్చన్న, రాజన్న, వెంకటేశ్ పాల్గొన్నారు.



భైంసారూరల్: ప్రచారం నిర్వహిస్తున్న టీచర్లు

హిందూ ధర్మ రక్షణలో ముందుండాలి

నిర్మల్‌ఖిల్లా: హిందూ ధర్మ రక్షణలో అందరూ ముందుండాలని శివాజీ సేవాసమితి వ్యవస్థాపకులు మెడిసెమ్మె రాజు, విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు పతికే రాజేందర్ పిలుపునిచ్చారు. 'హిందూ సామ్రాజ్య దినోత్సవం పురస్కరించుకుని నిర్మల్‌లో శనివారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. అనంతరం శివాజీ చౌక్ వద్ద వారు మాట్లాడుతూ శివాజీ చరిత్రను అందరూ తెలుసుకోవాలన్నారు. ప్రతీ ఇంట్లో భగవద్గీత ఉండాలన్నారు. లవ్ జిహాద్‌పై హిందూ మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బజరంగ్దళ్ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, హిందూవాహిని రాష్ట్ర సంపర్క ప్రముఖ్ సుంకరి సాయి, విభాగ్ ప్రముఖ్ మందుల విశేశ్, వడ్లకొండ అలివేలు, గోజ్జ జనర్దన్, నర్లాపురం రవీందర్, అంజుకుమార్‌రెడ్డి, శాంతిలాల్ పటేల్, పోలిశెట్టి విలాస్, నూకల నందకుమార్, రాఘవులు, రాజేందర్‌రెడ్డి, వ్యాపార వెత్తలు, ఆధ్యాత్మికవేత్తలు, వివిధ సంఘాల ప్రముఖులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న నాయకులు,కార్యకర్తలు

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీల వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. రోజుకు రూ.600 ఇవ్వడంతోపాటు పూర్తిస్థాయి పనిముట్లను అందజేయాలన్నారు. ఉపాధి హామీలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలతో తమ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 5న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ కన్వీనర్ బీఎల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూతన్‌కుమార్

ధాన్యం తరలింపునకు చర్యలు

కుంటాల: ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు చేపడుతామని తహసీల్దార్ ఎంఏ కలీం పేర్కొన్నారు. లారీల కొరత కారణంగా ధాన్యం తరలింపులో జాప్యం ఏర్పడుతుందని రైతులు జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న దృష్టికి తీసుకురాగా ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం కుంటాల వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సందర్శించారు. బీహారీ కూలీల కొరత మిల్లుల్లో అన్‌లోడింగ్ సమస్యతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రైతులు ఆధైర్యపడొద్దని తహసీల్దార్ సూచించారు. ధాన్యాన్ని విక్రయించే సమయంలో ఎవరికి డబ్బులు ఇవ్వొద్దని రైతులను కోరారు. ఆయన వెంట ఆర్ఐ విజయ్ తదితరులున్నారు.



రైతులకు నచ్చజెబుతున్న తహసీల్దార్ కలీం

టీజేఎస్ ప్లీనరీని విజయవంతం చేయాలి

ఖానాపూర్: సూర్యాపేటలో ఆదివారం నిర్వహించే తెలంగాణ జనసమితి పార్టీ మూడో ప్లీనరీని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కడపత్రి తిలక్‌రావు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించలేదన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని ఇప్పటికి ఇవ్వలేదన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

నిర్మల్‌టౌన్/ఖానాపూర్: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్‌ఎస్ నాయకుడు అల్లోల గౌతమ్‌రెడ్డి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ నిర్మల్ సమీకృత కలెక్టరేట్ భవనం, పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి సీఎం వస్తున్నారని పేర్కొన్నారు. ఎల్లపల్లి రోడ్‌లోని క్రషర్ గ్రౌండ్‌లో సీఎం సభ ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మంత్రి వ్యక్తిగత సలహాదారుడు నాలం శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మారు గోండ రాము, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఖానాపూర్ మండలం మస్కాపూర్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు బుక్య జాన్సన్‌నాయక్ మాట్లాడుతూ సీఎం సభకు నియోజకవర్గం నుంచి 10వేల మందిని తరలిస్తున్నట్లు తెలిపారు. కడెం నుంచి భారీ కాన్వాయ్ ర్యాలీతో కార్యకర్తలు, అభిమానులతో గుస్సాడీ నృత్యాల మధ్య సీఎం సభకు వెళ్తామన్నారు.

కులం పేరుతో దూషించినవారిని శిక్షించాలి

కడెం: మండలంలోని లక్ష్మీసాగర్ తండాకు చెందిన సపావత్ దేవేందర్‌ను కులం పేరుతో దూషించిన గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత నెలలో జరిగిన భూవివాదంలో దేవేందర్‌ను అకారణంగా తిట్టారని ఆరోపించారు. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోకపోతే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు వెంకట్రావ్, రాందాస్, రామారావు ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

సంక్షిప్తంగా

పరామర్శ

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన బీజేపీ కార్యకర్త గడ్డం సురేందర్ చిన్నమ్మ భూమవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. బీజేపీ నాయకుడు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా కార్యదర్శులు రాజేందర్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అర్జున్ ఠాగూర్, నరేందర్, మురళీధర్, లక్ష్మణ్, శేఖర్, సాయికృష్ణ, రాజు ఉన్నారు.

నేడు బీజేపీ మండల సమావేశం

ఖానాపూర్: మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం బీజేపీ మండల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు టీకు ప్రకాశ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలకు అవగాహన కల్పిస్తామన్నారు. అదే విధంగా పార్టీని బలోపేతానికి చేయాల్సిన కార్యక్రమాలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సన్మానం

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లిలోని డీసీఎంఎస్ వరి కొనుగోలు కేంద్రం నిర్వాహకుడిని రైతులు శనివారం సన్మానించారు. మండలంలోని అన్ని కేంద్రాల కన్నా ముందుగా వరి కొనుగోలు కేంద్రం పూర్తి చేసిన మహిపాల్‌రెడ్డిని సత్కరించారు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వటసావిత్రి పౌర్ణమి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ కాలనీలో గల కార్యసిద్ధి హనుమాన్ ఆలయంలో శనివారం వటసావిత్రి పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

నేతకానిల డిమాండ్లు నెరవేర్చాలి

కడెం: నేతకానిల డిమాండ్లు నెరవేర్చాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు దుర్గె వెంకటేశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నేట్‌కాని కాకుండా నేతకానిగా కుల సర్టిఫికెట్ ఇవ్వాలని, రాష్ట్రప్రభుత్వం హైదరాబాద్‌లో నేతకాని భవన్‌కు రెండెకరాల స్థలం కేటాయించాలని కోరారు.

అనాథలకు ఉచితంగా విద్య

ఖానాపూర్: 20 మంది అనాథ పిల్లలకు ఉచితంగా విద్య అందించనున్నట్లు గోసంపల్లె బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ బాక నాగమొగిలి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుపేదలైన 20 మంది అనాథ పిల్లలకు తమ పాఠశాలలో ఉచిత విద్యనందించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.